



# గాంధీగారి రాజ్యంలో గాంధారి కొడుకులు




వచ్చే యిరవై నాలుగ్గంటల వరకూ వాతావరణం పొడిగానే వుంటుందని రేడియోవారు హామీ యిచ్చిన కారణంగా, అదరగొడ్తోంది పొద్దుణ్ణించీ వర్షం

సినిమా సీతాదేవి కన్నీటిలా— అడ్డూ ఆపూ లేకుండా కురుస్తోంది వర్షం పెదనాయుడిగారి మేడనీ, రెడ్డెమ్మగారి దానానీ, శెట్టిగారి పెంకుటింటినీ ఏమీ చెయ్యలేక ఉడుకుమోతు తనంగా కురుస్తోంది వర్షం

లక్ష్మీనారాయణ రైసు మిల్లు సాయి బాబా సినిమాహాలు రేకుల మీద సప్త స్వరాలు పలికిస్తూ సరదాగా కురుస్తోంది వర్షం

నాగుల చెఱువులోనూ, రాజుల దిగుడు బావిలోనూ, పూనల కాలవలోనూ మృదంగం వాయిస్తూ—హుషారుగా కురుస్తోంది వర్షం

మల్లికార్జునుడి గుడిమీద త్రిశూలాన్ని కాథలిక్ చర్చిమీద శిలువనీ—మసీదు గోడల్లో పావురాళ్ళనీ పలకరిస్తూ ప్రేమగా కురుస్తోంది వర్షం

జంక్షన్లో గాంధీ గారినీ క్వారీ మెట్టుమీద ముష్టివాళ్ళనీ, పెద్ద వీధి గజ్జి కుక్కనీ నిమురుతూ, అసహాయంగా, జాలిగా కురుస్తోంది వర్షం

"యెదవ్వాన, దైద్రగొట్టోన, దీనమ్మా——ఊరికే సంపేస్తన్నాది" అంటూ వర్షాన్ని తిట్టుకున్నాడు పెద్దోడు తొమ్మిదేళ్ళ పసివెధవ——గుడిసె మీద గోనె గుడ్డని సవరిస్తూ అసలు దాన్ని గుడిసె అనటానికి వీల్లేదు ఓ పక్క ఎప్పుడో ఉప్పు సత్యాగ్రహ కాలం——నాడు కట్టబోయిన పుగాకు బేరన్ తాలూకు గోడ, నాలుగడుగుల యెత్తు, ఐదడుగుల వెడల్పున్నది దానిమీంచి ఏటవాలుగా దించిన రెండు వెదురు కర్రలు, తుప్పు పట్టిన ఓ యినప కమ్మీ, వాటిని చుట్టుకుంటూ కొన్ని తడపలూ, గడ్డి

మోకులూ, కిత్తనార తాళ్ళూ రోగిష్టివాడి నులకమంచంలా వుంటాయి వాటిమీదుగా జేనర్ల తాలూకు ఆయిల్ పెయింటింగు గుడ్డ ముక్కలూ, ఆ బేనర్ మీద చెరిగిపోయిన 'మనదేశం' అనే అక్షరాలూ, ఆ గుడ్డని అదుపులో పెట్టడానికి బట్టతలలా నున్నగా వున్న ఫైర్‌స్టోన్ వారి రెండు బస్సు టైర్లూ, ఓ సైకిల్ టైరూ ఏక్సిడెంట్‌లో ఊచ లూడిపోయి పూర్వకాలం గుండ్రంగా వుండేదాన్నిస్మా అని చెప్పే నలుచదురం సైకిల్ చక్రం వున్నాయి

ఆ ప్రదేశంలో యిలాటివే సుమారు ముప్పై, నలభై నివాసస్థలాలున్నాయ్ వాటికి అలంకారంగా ఇరవైనాలుగ్గంటలూ జుయ్యిమనే దోమలూ, ఈగలూ, రక రకాల పురుగులూ ఎక్కడ పుట్టిందో, ఎక్కడకు ప్రవహిస్తోందో తెలియని మురికి కాలువ వున్నాయి

రాత్రి పగలూ ఆ మురుక్కాలువ నుంచి వచ్చే దుర్వాసన ముక్కుల్నే కాదు, గుండెల్ని కూడా బ్రద్దలు కొడుతుంది

అలా బ్రద్దలైపోయిన గుండెలున్న వాళ్ళే అక్కడ బ్రతుకుతున్నారు అడు క్కుంటూ బ్రతుకుతున్నారు, ముష్టి బ్రతుకుతో చస్తున్నారు

"సె, ఎదవ ముట్టి బతుకు సచ్చినా పీడపోను" అని తన్ను తాను తిట్టుకుంటూ 'స్వర్గసీమ' వాల్‌పోష్టరున్న సింహద్వారం తడికి వొత్తిగించి లోపలి కెళ్ళాడు— పెద్దోడు'

జుట్టునొక్కి నీళ్ళు పిండుకున్నాడు పెద్దోడు

"వొలే' లమ్మా' గుడీది కెళ్ళొత్తానే—పొద్దిట్నించి సంటోడు ఆకలని ఏడ్చి, ఏడ్చి పుల్లిమామ్మ గుడిసెలో తొంగున్నాడు అలా ఎల్లొత్తా ఏ దరమతల్లయినా ఇంత గెంజెయ్యకపోదు" అన్నాడు

సూళ్ళూరుపేట రైలు ఏక్సిడెంట్ మిగిల్చిన ఒంటిసేత్తో నూలుపోగులకన్నా కన్నాలే ఎక్కువున్న రంగు తెలియని తన చీరె చెంగుతో పెద్దోడి తల తుడుస్తూ మశూచికం మిగిల్చిన ఒంటికంట నీరెట్టింది ఆ మాతృమూర్తి

"సిన్న యెదవ్వి' ఈ వొయిసులో మాయదారి బగమంతుడు నీకెన్ని ఆలో సెన్లు ఇచ్చిండు" అంటూ దగ్గుతూ దగ్గులో నెత్తుటి జీర లొలికిస్తూ—

"వొలే, నువ్వెడకే' నువ్వేడిత్తే దగ్గొత్తాది దగ్గొత్తే నెత్తురొత్తాది అసలే జొరంగా వున్నావా? యెచ్చగా తొంగో నీకు టీసీల్లు, కూడు—అట్టుకొత్తా సిటికెలో లగెత్తి, సిటికెలో వచ్చేత్తా యిమానంలాగ" అని సొట్టలు పడిపోయిన రెండు అమూల్ డబ్బాలు, చిరిగిపోయిన ఓ గోని గుడ్డా తీసుకుని బయటికి పరుగెత్తాడు

ఆ తల్లి ఏదో అనబోయి, దగ్గు తెరరాగా నీరసంగా ఓ మూల కూలిపోయింది

భూమాత గుండెల మీద నిల్చిన ఎర్రటి కంకర నీళ్ళు—ఆ నల్లటి మురికి నీళ్ళతో కలిసిపోయి విచిత్రమైన రంగులో, వర్షపు చినుకులకి వలయాలేర్పడుతూ,



నేను ఆమెను కాను!

ఇది కొత్త తెలుగు సినిమా పేరు కాదు 'విజయభాను' పేరుగల ఓ తమిళ నటి మరణం తన మరణంగా ప్రచారమై నందుకు ప్రక్కన కన్పించే తెలుగు నటి విజయభాను ప్రకటన ఇది ఈ తార క్షేమంగా ఉంది తన నటజీవితం కొన సాగిస్తూ నేవుంది

---

స్త్రియ లిప్టిక్ పెయింటింగుల్లా వున్నాయి అర్థం కాకుండా

ఐదుగురు భర్తల భార్య, ద్రౌపది చీకటి కోరికలా మేఘాలు బరువుగా మత్తుగా వున్నాయి

తన తప్పుడు ఎక్స్‌పెరిమెంట్ కర్ణుడి పుట్టుక్కి కారణం కాగా హైవోల్టేజిలో షాక్ తిన్న కుంతీదేవిలా (ఈ ఎక్స్‌ప్రెషన్ నాది కాదు ఎక్కడో, ఎప్పుడో చదివాను ఆ రచయితకి కృతజ్ఞుడ్ని )

అక్కడక్కడ ఆ ముష్టివాళ్ళ గుడిసెల్లోంచి, మూడురాళ్ళ పొయ్యిల్లోంచి, పొగ భయంభయంగా లేస్తోంది

వర్షం కురుస్తూనే వుంది

చేతకానివాడూ చేత కానీ లేనివాడూ చేసిన విఘ్నేశ్వరుడి మట్టిబొమ్మలావున్న తమ్ముడు చంటివాణ్ణెత్తుకొని, వాడి తలమీద గోనె కప్పి, చినుకూ చినుకూ మధ్య నుంచి దూసుకుపోతున్నాడు పెద్దోడు, గుడివీధికి గుడిలో దేవుడే జనానికి తిండి పెడతాడని ఓ రోజు హరి కథలో విన్న నమ్మకంతో—

"తల్లే—ఆకలమ్మా, కొంచం గెంజొయ్యి తల్లీ!" అనరచాడు ఓ ఇంటి ముందు నుంచుని

ఆకలి అనేమాట వినంగానే చంటాడికి ఆకలి అనే అనుభవం జ్ఞాపకం వచ్చి, ఋాలకోడిలా ఖయ్యిన ఆకలి, ఆకలి అని ఏడవడం లంకించుకున్నాడు వాడికి అసలు సంగీత జ్ఞానం లేదు అపశ్రుతిలో వాడి ఏడుపు అంత మనోహరంగా లేదు

అదే అభిప్రాయం ఆ ఇంటి యజమానికీ కలిగింది

ఆదివారం కనక నెలాఖరూ కనక అరపూట భోజనం చేసి, అయిదు పైసలు

ఖరీదే కనక తాంబూలం వేసుకొని, పడక్కుర్చీలో కూర్చొని, ఇంట్లో కూడా ఆఫీసు ఎక్కవుంట్లు చూసుకుంటున్న ఆయనగారికి, చంటాడి అపశృతి ఏడుపుతో ఆరు సార్లు కూడినా తప్పుగా వచ్చిన సంఖ్య, ఏడోసారి కూడా వచ్చింది దాంతో ఆయనకి సహజంగా చిర్రెక్కి "ఆ వెధవ నొర్నొక్కేయ్ ముందు, తర్వాత నువ్ తక్షణం వెళ్ళిపో, చెయ్యి వూరుకోలేదు" అన్నాడు ఏడోసారి తప్పుగా వచ్చిన సంఖ్యని, ఎనిమిదోసారి రిపేరు చెయ్యడానికి ట్రై చేస్తూ—

ఎంత నోరు నొక్కినా, చంటాడి ఏడుపు తగ్గలేదు సౌండ్ అంతకంటే తగ్గలేదు కనుక ఇంటాయనకి సరైన కూడిక దొరకనూ లేదు, కనుక ఆయన భార్య కాస్త అన్నం తెచ్చి వెయ్యబోతుంటే కాట్లకుక్కలా ఆవిడమీదపడి అరిచాడు




"పెద్ద ధర్మాత్మురాలివి బయల్దేరావ్ ఇదేం ఇండియా అనుకున్నావా? అమెరికా అనుకున్నావా?? నేనేం నీ మొగుణ్ణనుకున్నావా? ఎమ్మెల్యేగారి బావమరది ననుకున్నావా?? గెటౌట్ టు వంటిల్లు" అని మళ్ళీ పడక్కుర్చీలో పడిపోయాడు

చంటివెధవ ఆకలి ఆకలి అంటూనే వున్నాడు


పెద్దోడు "తల్లీ—అమ్మా" అంటూ మరో ఇంటికెళ్ళాడు

"తల్లీ! ఆకలేత్తన్నాది కుంచెం గెంజీకూడు ఎట్టమ్మా!"

"తల్లి—ఏదో లోనున్నట్టున్నది గెట్టిగా అరిసినా పలకలేదు"

"ఓరీ సంటోడా! ఏడకురా, తల్లి—గెంజోత్తాది ఏడకు ఆరి యెధవాని, ఏడకంటే— ఏడకురా బాబూ!— ఏడిత్తే ఆకలెక్కువై పోద్దట— అసలు ఏప్పిలు కాయ త్తిన్నా— రసగుల్లాలంట అయితిన్నా ఆకలి తీరుదంట— అలాగని బస్సు స్టేండులో 'అడుక్కునే కుంటెంకటేశు సెప్పేడు ఆడోసారి సగం కుల్లిపోయిన ఆపిల్‌కాయ తిన్నాట్ట మనకా సాన్సు ఎప్పుదొస్తాదో—ఆకలే అంటే అమ్మెప్పుడూ ఆపిలుకాయ లెట్టనేదు 'కాసేపాగు యెదవకానా! కూడుతిందువు గానీ,' అనేది కాని యెప్పుడూ కూడెట్టేది కాదు కళ్ళమ్మట నీల్లెట్టుకునేది ఏడకేలమ్మా! మల్లెప్పుడూ ఆకలని ఏడను అంటే, ఎదవ జలమ బగమంతుడా! అని ఎక్కెక్కి మరీ ఎడిసేది కానీ సంటెదవకి ఏటి తెల్దు— మూగెదవ— అమ్మా! అమ్మా! అంటాడు నోటేప్పు యేలు సూయించి యియ్యి, యియ్యి, అంటాడు అమ్మేటిస్తది??

— — — "గుడిసే సెదవ, ఇద్దరు వొజ్జిరాల్లాటి బిడ్డల్ని కని నన్నొగ్గేసి, ముండతో పట్నం తుర్రుమన్నాడు ముండల్నెట్టి యాపారంసేసి సినేమా తీస్తున్నాడంట నానేటి సెయ్యను కూలో నాలో సేసుకుందామనుకున్నా మాయదారి బగవంతుడు వోకన్ను, కాలూ, సెయ్యీ నాగేసుకున్నాడు" అని ఏడుస్తాది అమ్మగనక అలా




యేడిస్తే, అదేదోలా అయిపోయి నాక్కూడా ఏడుపొచ్చేస్తాది ఎప్పుడేనా—ఏ దరమ తల్లేనా వో గుప్పిడు గింజలిస్తే ఇంటికి లగెత్తుకు తెచ్చేస్తానా— అమ్మ పాపం ఒంటి కాలీడ్చుకుంటూ పొయ్యికాడకొస్తదా—నాకు బలే జాలేస్తది వొంటిసేత్తో గెంజి కలే పెట్టుద్ది అప్పుడు నాకు ఏడుపొచ్చేస్తది వొలే' నువు తొంగోయే నాను గంజి కాస్తానంటే, 'నా రాజు-నా బాబు నానంటే నీకెంత యిది, అని ముద్దెట్టుకుంటదా— అబ్బ నిజంగా అమ్మ, అప్పుడు ఎంత అందంగా వుంటదంటే—నా సామిరంగా, నే సెప్పలేను గెంజికాసి మూకుట్లో పోసి, వూది సల్లారబెట్టేలోగానే సంటోడు "ఇయ్యి, ఇయ్యి" అని గోల సేసేస్తాడు ఆడు సన్నగా, పుల్లలాగుంటాడా—అలాగని మరి గొంతుకో రాచ్చసి గొంతుక— ఘంటసాలోడి స్టోన్లావుంటది ఏడిపి, గోలసేసి గెంజలో మూడొంతులు ఆడే తాగేస్తాడు మిగిలిందంతా అమ్మ నా మూకుట్లో పోస్తది నా కింతొద్దే—నువ్ కొంచం తాగే అంటానా—నా కాకతేదంటది—వుత్తిదే—నేన్నమ్ము తానా—అసలు మొన్నన్నించి అమ్మ వచ్చి మంచినీళ్లేనా తాగనేదు

"వొలే లమ్మా—నా నిప్పుడే అదెవరో పెళ్ళోరి లోగిలట ఆడు కూడెట్టింద్రే-పప్పన్నం—ఇంతింత బూర్లు, అనేలోగానే సంటోడు, ఇయ్యి, ఇయ్యి అంటాడు—ఎదవకి బుర్రనేదు నాను నిజంగా తిన్నానేటి? వుత్తిదే, పెళ్ళీ లేదు, బూరుల్లేవు—అలాగంటేగాని, అమ్మ గంజి తాగదేమరి'—అనిలాగ సెప్పి ఇల్లిలా సెప్పి, సినేమా పాటలు పాడి, నవ్వించి, అమ్మచేత ఓ గుక్క గెంజి తాగిపిస్తానా—మళ్ళీ సంటెదవ ఇయ్యి ఇయ్యి అంటాడు అసలీడు మంగళగిరి పానకాల సోమంట ఏ పోలీసోడో

సేపం యెడితే మా కొంపలో పుట్టేడంట ఇల్లాగని కనకమహాల్ కాడ అడుక్కుంటాది పుల్లిమామ్మ. అది సెప్పింది అది నిజమే అయ్యుండాలి — ఎందుకంటే అది అప్పుడప్పుడు నేల క్లాసులో దొంగతనంగా— టూరింగ్‌టాకీసుల్లో బత్తి సినిమాలు సూత్తాది నాక్కూడా యీడు బగవంతుడేనని సాలా నమ్మకం ఎందుకనంటే

వోరోజు గుడి యీదికి అడుక్కోడాని కెల్లేం అక్కడో పెద్దిల్లుంది గేటు తీసి లోన కెడితే వో పెద్దకుక్క భౌయ్ మంది లగెత్తుకు బయటికొచ్చేం—ఆ ఇంట్లో వాళ్ళ పిల్లలు కుక్కకి బిసకట్లు ఇసుర్తున్నారు బచ్చాలాటలో బెత్తు ఇసిర్నట్టు-ఆ కుక్కముండ వొక్కో బిస్కట్టు ఎగిరి లటుక్కున అందుకుంటున్నాది సంటెదవ ఆ బిసకట్లు సూయించి 'ఇయ్యి ఇయ్యి' అని ఒకటే గోల—నానేటి సెయ్యను

"బాబూ! సంటోడు ఏడుస్తుండు ఓ బిసకట్టియ్యి బాబూ!" అని గట్టిగా అరిసినా—'బిసకట్టా! నీ బాబుగాడి సొమ్మేం ఇక్కడ దాచపెట్టనేదు, లేదు, యెల్లెల్లు అన్నాడో గుంటనాయాలు మా బాబు ఏదన్నా దాసపెడితే—ఎందుకు అడుక్కుంటాం. నాకు నిజంగా కోపవొచ్చినాది సంటోణ్ణి గేటుకాడే దింపి-లోనకి లగెత్తి, ఆ గుంట నాయాలు చేతిలో బిస్కట్టు లాక్కున్నా—ఆ పిరికి యెదవ, 'బాబోయ్, ఈడు సంపేసేడు, అని, ఒకటే గోల, నిజానికి నానేటి సెయ్యనేదు ఆ పిల్లనాయాళ్ళ బాబు కావోసు లోపల్నుంచే వొచ్చి నా గూబ మీద ఓటిచ్చాడు ఆ దెబ్బకి నా పేణం గింగిరా త్తిరిగి పోయి, "ఓర్నంజికొడుకో! గుడిసేటోడో, నీ సేతులిరిగిపోనా" అని తిట్లు లంకించుకున్నా ఆ నంజికొడుకు నన్ను, "దొంగ నంజికొడకా!' అని తిట్టి, సెట్టుగట్టి, సింత బరికుచ్చికుని సెళ్ళు సెళ్ళు మని కొట్టడం మొదలెట్టేడు రిచ్చారావుడి దగ్గర నేర్సుకున్న బూతులన్నీ వొక్కటేనా వొదలకుండా తిట్టినా!— నే తిట్టేకొద్దీ, ఆ కుక్కల కొడుకు రెచ్చిపోయి, నన్ను సితగ్గొట్టేసేడు ఈ లోపున సంటెదవ ఎలా పాక్కుంటూ వొచ్చేడో, ఆ దైద్రం నంజికొడుకు దగ్గరికొచ్చి కాట్లకుక్కలా కసిక్కిన, ఆడి సీలమండ నోటితో లంకించుకున్నాడు సంటోడిది రాచ్చసపట్టు —మొసలిపట్టు—ఆడు నన్ను కొట్టడం ఒగ్గేసి 'నీయమ్మా!' అని కాలిదిలించేడు సంటోడు అల్లంతదూర వెళ్ళి సిమ్మెంటు కుండీమీదపడి గుక్క తిరక్క గిలగిల్లాడి పోయేడు—పీకతెగిన కోడిలా అల్లల్లాడిపోయాడు—ఆ దెబ్బకి ఆడు సచ్చిపోయాడేమో అనుకున్నాను ఈ లోపున ఆడి పెళ్ళాం కావోసు—వచ్చి—'అయ్యయ్యో! సంపేసినారు' అని నన్ను కట్లూడిపిచ్చి అన్ని తీసుకుపో అంది—ఓ రెండు బిస్కట్లు ఇచ్చింది మా తల్లి —సంటోణ్ణి తీద్దునా- కిందంతా రగతం తల బొక్కడిపోనాది ఆడు కొయ్యబారిపోయాడు భయమేసి నోట్లోను, సెవుల్లోనూ వూదేను అప్పుడేడ్డం లంకించుకున్నాడు నిజంగా ఆడు బగమంతుడు





పాలకొల్లులో తనకు జరిగిన మరువలేని సన్మానానికి 'అలోవలోవలో' అంటూ ప్రేక్షకుల్ని పలకరించి కృతజ్ఞతలు చెప్పుకొంటున్న గంభీరస్వర రావుగోపాలరావు (అన్నట్టు ముత్యాల ముగ్గులో కంట్రాక్టర్ మాటల్ని గ్రామఫోన్ రికార్డ్‌పై కెక్కించారు ఆ రికార్డు గ్రామఫోన్ గికార్డు అమ్మకపు రికార్డును బద్దలు కొట్టేస్తుందని నమ్మకమైన వార్త)

---

కాపోతే అక్కడే, ఆయేలే, రారున సచ్చిపోయుండేవోడు

నిజంగా ఆడు బగమంతుడే అయితే, అమ్మ కడుపున పుట్టేడు గందా - మరి అమ్మకి రెయిలు పడిపోతే కాలూ, సెయ్యీ ఎందుకు పోతయి అమ్మోరొచ్చి కన్నెందుకు తీసేసుకుంటది బాబు అమ్మనెందు కొగ్గేస్తాడు ఇయ్యన్ని అనుకుంటే ఒకేళ ఆడు బగమంతుడు కాదేమోననిపిస్తది

గుడిమీది దేవతలా,వర్షంలో తడిసిపోతూ చలిచలిగా ఆలోచిస్తున్నాడు పెద్దోడు

డబ్బున్న వాళ్ళింట్లో మధ్యాహ్నం టిఫిన్‌కు ఉల్లిపకాడీలు వేసే మూకుడులో సలసలా మరిగే నూనెలా, వాడిగా, వేడిగా ఆలోచిస్తున్నాడు వాడు

"ఏమిట్రా వెధవా' అన్నం అక్కర్లేదా? డబ్బా పట్టు" ఓ ఇల్లాలి కేకతో ఇహలోకంలోకి వచ్చాడు పెద్దోడు

"తల్లీ' ఛెమెంచు తల్లీ'" చెయ్యని తప్పుకు కూడా క్షమించమనడం ముష్టి ధర్మం మాత్రమే కాదు, అది వాళ్ళ జన్మహక్కు

ఓ డబ్బా నిండుగా పులుసూ అన్నం పడంది

పెద్దోడు గుండెలు తరుక్కుపోయేలా అమ్మా! అన్నాడు

ఏం ఎంత పెట్టినా సరిపోదు వెధవలకి దురాశాపాతకులు పులుసూ అన్నం ధర్మవల్ల సంపాదించిన పుణ్యం అంతా కేన్సిలయ్యేలా తిట్టింది ఆమె

"అదికా తల్లీ!

'మరేమిటి?

కొంచం టీ నీల్లొయ్యి తల్లీ

టీ నీళ్ళా - ఏం ఓవల్టీను వద్దూ!

ఎంత మాట తల్లీ మా యమ్మకి పది రోజుల్నుంచి జొరం నెగడంలేదు దగ్గితే నోటంట నెత్తురు కారుద్ది నాల్రోజులికి ముందు ఓ దరమదాత పదిపైసలిస్తే టీ బట్టుకెళ్ళినా - మళ్ళీ ఈయాలవరకూ పచ్చినీరైనా తాగనేదు అందుకని

పెద్దోడికి నిజంగా ఏడుపొచ్చింది

జుట్టునుంచి నుదుటిమీదికి కారుతున్న నీళ్ళలో వాడి కన్నీళ్ళు కలిసిపోయాయి

వర్షంలో తడుస్తూ చంటివాణ్ణి చంకనెత్తుకుని వర్షం నీరు పడకుండా అన్నం వున్న డబ్బాని గోనెలో దాచుకుంటూ ఆ పసివెధవ తల్లికోసం పడే ఆవేదన ఆమె స్త్రీ హృదయాన్ని కదిపివేసింది

అదేమిట్రా దగ్గితే నోరంట రక్తం వస్తే అది క్షయ చాలా ప్రమాదం అది అంటువ్యాధి ధర్మాసుపత్రికి తీసికెళ్ళకపోయావా అంది

తీసికెల్లానమ్మగోరూ గేటు దగ్గరున్నోడు లోనకెల్లడానికి పావలా యిమ్మన్నాడు పావళా వుంటే ఆసుపటాల్కి ఎందుకెడతాం రాజాలాటి డాట్టర్నెట్టి అమ్మకు మందు తెచ్చేవోణ్ణి బాబూ డబ్బునేదు లోనకొగ్గే - సచ్చి నీ కడుపున పుడతా అని కాల్లట్టుకున్నా - ఆడు నీ ముష్టినా కొడకా నా కడుపున పుడతావా అని గెంటేసేడు నాకో మంచి ఆలోసెనొచ్చింది ఎలాగేనా లోనకెళ్ళి డాట్రుబాబు కాళ్ళమీనడితే ఆ బాబు దయబెడతాడని - ఎందుకనంటే నేను దొంగతనంగా సూసిన ఓ సినేమాలో డాట్రుబాబు లేశోళ్ళంటే పేరమే యిచ్చేసిండు అల్లందుకని పిట్టగోడ గెంతి లోనకి లగెత్తబోయా - గేటు దగ్గరున్నోడు సూసి ఆగు దొంగ నాయాలా అని పక్కనున్న పొతకలాటి నల్ల కంకర్రాయి యిసిరిండు అని కుడి కాలి మడమ చూపించాడు

రెండంగుళాల గాయం భయంకరంగా ఎర్రగా నెత్తురోడుతూ వుంది


ఆ ఇల్లాలు ఆ భయంకరమైన గాయాన్ని దాని వెనుకనున్న అంతకంటె భయంకరమైన నిజాన్ని భరించలేక మధ్యాహ్నానికి ఫ్లాస్కులో పోసుకున్న టీ డబ్బాలో పోసి ఓ పదిహేను పైసల చిల్లరిచ్చి వాళ్ళబ్బాయివి చిరిగిపోయిన రెండు

చొక్కాలిచ్చింది

పెద్దోడికి గుండెల్లోంచి ఎదో బాధ దొల్చుకొచ్చింది

గుడిలోని దేవి ప్రాణంతో వచ్చి అడిగిన వరాలిచ్చినప్పటి అనుభూతి అది—

రెండు డబ్బాలతో చంకన మూడేళ్ళ చంటివెధవతో నెత్తిన తడిగోనెతో చంకలో రెండు పొడిగుడ్డలతో ఎలా వంగాడో ఎలా ఆ ఇల్లాలి పాదాలు కళ్ళకద్దుకున్నాడో ఆమెకే అర్ధరకాలేదు ఆమె రెప్ప వాల్చకుండా పెద్దోడు కనుమరుగయ్యే వరకూ చూసి భారంగా నిట్టూర్చింది వర్షంలో తడుస్తూనే—




నువ్ గెంజి కాయక్కర్నేదే పులుసూ వొణ్ణం తెచ్చా నీకు టీనీల్లట్టు కొచ్చినా—తాగే— అదేటే వొళ్ళు సల్లంగున్నాది జొరం తగ్గిపోనాదా? —అవుతే ఓ ముద్ద తినే

డబ్బాలోంచి వో ముద్దతీసి నోట్లో పెట్టాడు ఆ తల్లి పళ్ళువిడలేదు

చంటివెధవ ఇయ్యి ఇయ్యి అంటున్నాడు

మూతినిండా వులుసూ వొణ్ణం మెతుగులు అలాగే వుండిపోనాయి

అమ్మాని లేపితే లేవలేదు

వాడికి భయం వేసింది

పక్కగుడిసె పుల్లిమామ్మని ఎల్చాడు—ఆమె ఒచ్చింది—చూసింది

వొరే—మీయమ్మ సచ్చిపోయిందిరా అంది

చంటివెధవ రెండు చేతులా పులుసూ అన్నం బొక్కుతున్నాడు వొంటినిండా పోసుకుంటూ—

మీ యమ్మ సచ్చిపోయింది ఎడకు అంది పుల్లిమామ్మ

నేన్నిజంగా యేట్టం నేదు అని వాడు అమ్మ దగ్గరికి వెళ్ళి మూతిమీద వున్న మెతుకుు ఆ ధర్మతల్లి ఇచ్చిన చొక్కాతో తుడిచాడు

అమ్మ మొకం నవ్వినట్టనిపించింది

నిజంగానే అమ్మ నవ్వింది

వాడు చంటివాణ్ణెత్తుకుని అమ్మ కాళ్ళకి మొక్కి— వొలే అమ్మా మేం ఎ యీదికెళ్ళినా ఒడుక్కోగానే అందరూ వొణ్ణాలు పెట్టేలా ఆశీరదించే అని

సంటోడి రెండు సేతులు దగ్గరగా యెట్టి అమ్మకి దండవెట్టించి బయటికి వొచ్చేసేడు పెద్దోడు—చంకన చంటాడితో—

ఈశ్వర అల్లా తేరేనాం సబ్‌కో సన్మతి దే భగవాన్
దూరంగా పుల్లిగాడి గుడిసెలోంచి రాగం వినిపిస్తోంది ఆకలితో బాధతో

శిలువ మీది క్రీస్తునీ—
బోధివృక్షం కింది బుద్ధుణ్ణీ—తడిపిన వర్షం—
గుడిసె కంతల్లోంచి జారి పెద్దోడి తల్లినీ తడుపుతోంది
వర్షం కురుస్తూనే వుంది—
ముక్కోటి దేవతలూ అష్టదిక్పాలకులూ త్రిమూర్తులూ దేవేంద్రుడూ—
ఆకాశంలో నక్షత్రాలుగా సెటిలైపోయిన సప్తఋషులూ—
ఆంధ్రదేశంలోని అనాథుల్ని చూసి సేడిస్టిక్‌గా ఆనందబాష్పాలు కురిపించి నట్టు—
కురుస్తోంది వర్షం
జోరుగా !!
హాయిగా !

★

---


# ఆంగ్లేయ బోధిని

పిన్నలు పెద్దలు ఆంగ్లము రానివారు మా ఆంగ్లేయబోధిని సహాయంతో 60 దినములలో ఆంగ్లము నేర్చుకొనవచ్చును వెల రూ 10/

# తమిళ్-తెలుగు స్వబోధిని

తమిళభాష రానివారు మా తమిళ తెలుగు స్వబోధిని సహాయంతో 35 దినములలో తమిళం నేర్చుకొనవచ్చును వెల రూ 3/-

# హిందీ-తెలుగు స్వబోధిని

హిందీ భాషను అతి సులభముగా అందరు 30 దినములలో హిందీ తెల్గు స్వబోధినిద్వారా అతి త్వరలో నేర్చుకొనవచ్చును వెల రూ 4/

పై వాటికి పోస్టేజి అదనము

బాలసరస్వతీ బుక్ డిపో (ఫోన్ 29868) మద్రాసు 600 001